పెట్టె, బేగ్‌తో ఆటో దిగుతున్న కూతురు కల్పవల్లిని చూసి శారదమ్మ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

"ఇదేమిటే చెప్పా పెట్ట కుండా ఓ కార్డు ముక్కయినా రాయకుండా అకస్మాత్తుగా ఈ రావడమేమిటీ?" అంటున్న తల్లిని చూస్తూ "అమ్మా ! ఈ రోజుతో ఆ ఇంటికీ నాకూ తెగ తెంపులయిపోయాయంటున్న కూతురి వైపు పిచ్చిదానిలా చూస్తూ అదేమిటే ! మొన్న రెండు నెలలపాటు నీ ఇంట్లో వుండి నీసంసారం చూసొచ్చాం - బంగారంలాంటి కాపరం, అల్లుడికి ఒక్క దుర్వ్యసనం లేదు - పెళ్ళై నాలుగేళ్లు కావస్తోంది. ఎప్పుడూ అతని గురించి ఒక్క చెడ్డమాట నువ్వన్నా చెప్పలేదు. అలాంటిది ఒక్కసారి ఏకంగా యివాళ అతనితో తెగతెంపులే చేసేసుకు రావడమేమిటే? మంచీ, చెడు ఆలోచించు కోకుండా ఏమిటీ నిర్ణయం?" అంటున్న తల్లివైపు కందగడ్డలా చేసుకున్న ముఖంతో చూస్తూ.. "అమ్మా ! ఆయన ఈ నాలుగేళ్ళ నుంచీ బుద్ధిమంతుడిలా నటిస్తూ ఆడుతున్న డ్రామా ఈ రోజు బైట పడింది" అంది కల్పవల్లి.

"పోనీ ఇది మొదటి పొరపాటని సర్దుకోవచ్చు కదమ్మా! ఎంతయినా మనం ఆడవాళ్ళం... "

"చూడమ్మా ! అది మీ కాలంలో - మా కాలంలో కాదు. తప్పన్నాకా ఆడ చేసినా మగ చేసినా తప్పు తప్పే ! నాకు ఆ నీతులేం చెప్పకు" అంది తల్లి మాటల్ని పూర్తి చెయ్యనివ్వకుండానే కల్పవల్లి.

"ఇంతకీ అల్లుడు చేసిన క్షమించరాని నేరం ఏమిటో చెప్పకుండా ముందు తెగతెంపుల గురించి మాట్లాడుతున్నా వేమిటి?"

# అమ్మ చెప్పిన నిజం.

"నేనూ చిన్న పిల్లని కాదు, చదువుకుని ఉద్యోగం చేసుకొంటున్న దాన్నమ్మా ! నేనూ అనాలోచితంగా ఏ పనీ చెయ్యను. చెయ్యరాని తప్పు చెయ్యబట్టే నేనీ నిర్ణయాని కొచ్చాను. అల్లుడిని యింతగా వెనకేసుకొస్తున్న నీకు అతను చేసిన ఘనకార్య మేమిటో చెప్తాను విను. విని సమర్థించాలో దూషించాలో చెప్పు. నువ్వు పాతకాలం మనిషివయినప్పటికీ నీ భర్త యిలాంటి పని చేసి వుంటే క్షమించే దానివి కాదు అంది చేతిలోని బేగ్ కుర్చీలోకి విసిరి కూర్చుంటు.

ఇంత ఆవేశంతో వున్న కూతుర్నింక ప్రశ్నించడం ఈటైములో మంచిది కాదని లోపలికెళ్లి మంచినీళ్లు తెచ్చి యిచ్చి, పద ముందు స్నానం చేసిరా ! భోజనం చేద్దుగాని అంది శారదమ్మ.

సాయంకాలం నిద్ర లేచిన కల్పవల్లికి కాఫీగ్లాసు అందించి పక్కనే కూర్చుంది శారదమ్మ కూతురి ముఖంలోకి చూస్తూ. ఉదయం కల్పవల్లిలో వున్న ఆవేశం కాస్త తగ్గినట్లు అనిపించింది శారదమ్మకి .

"నాన్నేరమ్మా ! కనిపించటంలేదు ?"

"మీ మేనత్త ఆరోగ్యం బాగాలేదని కబురొస్తే చూసొస్తానని వెళ్లారమ్మా ! అవును గానీ ఉదయం మన మాటలు సగంలోనే ఆగిపోయాయి. అలిసిపోయి వున్నావు తరవాత అడగొచ్చని వూరుకున్నాను. అసలు విషయ మేమిటో చెప్పు"

"అమ్మా ! నాకు అబార్షన్ అయినప్పుడు ఇంట్లో సహాయంగా వుంటుందని మూగది, వెర్రిబాగుల్ది అయిన పనిపిల్లని పెట్టాను తెలుసుకదా !"

అవును -

"అసలు దాని తల్లికి ఆ పిల్లని పనికి పెట్టడం యిష్టం లేదు. నా కూతురు అమాయకు రాలు, పైగా వయసులో వుంది, దానికేం తెలీదమ్మా - ఎవరింట్లోనూ పనికి పెట్టనమ్మా! అన్నా బ్రతిమాలి నీ కూతురికేం భయం లేదని హామీ యిచ్చి మా ఇంట్లో పెట్టుకున్నాను. దానికిప్పుడు మూడోనెల గర్భిణీ తెలుసా?" అన్న కూతురి మాటలకి పక్కలో బాంబు పేలినట్లు అదిరిపడి ఆ - "అని నోరు తెరుచుకుని వుండిపోవడం తప్ప ఏమీ అనలేకపోయింది శారదమ్మ.

"ఇప్పుడు తెలిసిందా నీ అల్లుడి ప్రతాపం? యిప్పుడు చెప్పు అలాంటి భర్తతో కాపరం ఎలా చెయ్యమంటావో? ఇప్పుడుదాని తల్లికేం - జవాబు చెప్పను? పోనీ అది మరో

నాలుగిళ్ళు పని చేసుకుంటోందంటే మరెవరో ఈ వెధవ పని చేసారనుకుందును. ఇంతవరకు నా ఇంట్లో తప్ప మరెక్కడా అది పని చెయ్యలేదు." అంది వుబికి వస్తున్న దుఃఖాన్ని అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తూ.

కూతురి బాధని అర్థం చేసుకున్నట్లు శారదమ్మ కల్పవల్లిని అక్కున చేర్చుకుని ఊరడించసాగింది.

కల్పవల్లి గుండెల్లో బరువు తగ్గేదాకా అలా తల్లిఒడిలో కూర్చుని బాధ పడుతూనే వుంది.

కాస్త తమాయించుకున్న తరువాత అమ్మా కల్పవల్లీ ! యిందాక నువ్వో మాటన్నావు గుర్తుందా ?" అన్నతల్లి మాటలకి తలెత్తింది కళ్ళు తుడుచుకుంటూ.

ఏమిటన్నానమ్మా !

"అదే – నువ్వయినా నీ భర్తలాంటి పనిచేస్తే క్షమించవు – అని. అమ్మా కల్పవల్లీ ! ఇవాళ నా గుండెల్లో ఎన్నో ఏళ్లుగా దాచుకున్న అగ్ని గుండాన్ని బైట పెడతాను వింటావా?"

........................

"ఇప్పటికి నలభై ఏళ్లుగా నీ తండ్రితో కాపరం చేస్తున్నా – ఇంతవరకు నీకు గానీ, నీ చెల్లెలికి గానీ నీ తండ్రి గురించి ఏ ఒక్కవిషయం తెలీనీకుండా గుట్టుగా దాచి బ్రతుకుతున్నానంటే మీరు నమ్మరు. నీ తండ్రి నా గుండెల్లో పెట్టిన నిప్పుల కుంపటి శగల్ని భరిస్తూ ఇంకా బ్రతికుండటమే కాదు, ఇంకా ఆయన్ని వదలకుండా కాపరం చేస్తున్నానంటే నమ్ముతావా?"

ఏమిటమ్మా ! నువ్వనేది? దేముడి లాంటి నాన్ననా నువ్వు నిందిస్తుంట? ఆయన మనకేం లోటు చేసారు? ఎప్పుడూ ఎవర్నీ ఒక్క మాటకూడా అని ఎరగరే?!

"అవునమ్మా! అదే ఆయనలో వున్న గొప్ప తెలివితేటలు. పైకి ఎంతో పెద్దమనిషిలా నటిస్తూ అందరి దగ్గరా ఎంతో మంచి మనిషిగా నాటకమాడుతూ, బంధువర్గంలో నన్నెంతో అపురూపంగా చూసుకుంటున్నట్లు ప్రవర్తిస్తూ, ఇల్లే సర్వస్వం అని అందరికీ చెప్తూ చేసే వెధవ పనులు నా ఒక్కదానికే తెలుసు. నేను వాటిని అలా నాలోనే సమాధి చేసుకుంటు పైకి నవ్వుతూ లోపల, లోపల కుళ్ళిపోతూ ఈ నలభై ఏళ్ళ నుంచి ఈయనతో కలిసి ఎలా బ్రతుకుతున్నానో ఈ రోజు చెప్తాను విను.

........................

"నేను పెళ్ళయి పదిహేనో ఏట ఈ ఇంటికి వచ్చాను. పెళ్ళికాని యిద్దరాడబిడ్డలు అత్తగారూ– ఈ ముగ్గురూలంకలో పుట్టవలసిన రాక్షసులనే చెప్పాలి. వాళ్ళు ఎంత క్రూరాత్మురాళ్ళయినా కనీసం కట్టుకున్న భర్తయినా మంచి వాడయి, ప్రేమగా చూస్తే మనసుకి ఎంతో శాంతి లభించేది. తల్లీచెల్లెళ్ళ విషయం తెలిసీ తెలీనట్లు పట్టించుకునే వారు కాదు. అంతేకాదు పచ్చి స్త్రీలోలుడు. అందిన ఆడదాన్ని అనుభ వించడం – అందని వారితో మానసిక వ్యభి చారం చెయ్యడం ఆయన దినచర్యల్లో భాగం. ఇది తెలిసి తల్లి, తోబుట్టువులూ ఆయన్ని ఏమీ అనేవారు కారు సరికదా; నన్ను సూదుల్లాంటి మాటలతో పొడిచి వెటకార్లాడేవారు. ఆఫీసులో తోటి ఉద్యోగినులతో రాత్రుళ్ళు హోటళ్ళలో గడిపి వస్తున్నట్లు తెలిసేది. కానీ ఎవరికి చెప్పుకుని ఏడవను? ఎవరు సానుభూతితో నన్ను అర్థం చేసుకుని వాళ్ళకి బుద్ధి చెప్తారు? – నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?




## కందుకూరి వెంకటమహాలక్ష్మి

ఎందుకిలా హింసిస్తున్నారని ఆయన్నే ఒకసారి అడిగాను జవాబుగా వచ్చిం దేమిటో తెల్సా ! ఎవరో వెధవలు చెప్పే మాటలు నమ్మకు. నీకేం లోటు చేస్తున్నాను??" అంటూ మోసం చేసారు.

కాలగమనంతో పాటు కష్టాల కాలువలో కొట్టుకుపోతూనే వున్నాను. ఆడపిల్లల పెళ్ళిళ్ళయ్యాయి. ఆ పోరు తగ్గింది. మరో కొన్నేళ్ళకి అత్తగారు గతించింది. మరికాస్త శాంతి ఇంట్లో లభిస్తుందనుకున్నాను. కానీ మీ నాన్న వ్యసనం మరీ పబ్లికయింది. ఇక నాకు తన విషయం తెలిసిపోయిందని ధైర్యంగా ఆ చవకబారు స్త్రీలను ఇంటికే తీసుకురాసాగారు. ఇరుగు పొరుగులు, బంధువులు నన్ను వెటకారాలాడి, నలుగుర్లో సూటీ పోటీగా మాటలనేవారు. మర్యాదైన కుటుంబంలో ఆడవాళ్ళెవ్వరూ వచ్చేవారు కాదు. కొందరైతే మీ ఇంటికి రావాలంటే భయం తల్లీ మీ ఆయన నమిలి మింగేసేలా చూస్తాడు అంటూ ముఖంమీదే అనేవారు. ఇలా చచ్చి బ్రతుకుతున్న నాకు మీరిద్దరూ పుట్టారు. మీరు కాస్త పెద్దవాళ్ళయ్యాక ఇంటికి ఆ చవకబారు స్త్రీలను తీసుకురావడం మానేసారు. మీ పెళ్ళిళ్ళయి, అల్లుళ్లొచ్చాకా కాస్త బుద్ధి మారుతుందనుకున్నాను. ఆయనలోఏ మార్పు రాలేదు. రిటైరయ్యాకా ఆ ఆడవాళ్ళతో తిరగడం తగ్గిందనేకంటే ఆయనలో వచ్చిన ముసలిరూపు చూసి ఆ రకం ఆడవాళ్ళు రావడం తగ్గిందనడం సమంజసమేమో ! వేశ్యల దగ్గరికి వెళ్ళినప్పుడు సంక్రమించిన చెడు రోగాలకి భయపడి వారికి దూరంగా వుండ సాగారు !

"పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో" అన్నారు పెద్దలు ! శారీరకంగా వచ్చిన కొన్ని మార్పుల వల్ల ఆ వ్యసనం కాస్త తగ్గినా, కోతి బుద్ధిలో మార్పురాక చవకబారు పుస్తకాలు చదవడం, టి.వి.లో వచ్చే అర్ధనగ్నపు చిత్రాలని చాటుగా చూస్తూ అలికిడి అవగానే పుస్తకాలు దాచెయ్యడం, ఛానల్ మార్చెయ్యడం లాంటివి చేసేవారు.

నాలోనూ సహనం చచ్చినా కట్టుకున్న భర్త అన్న వాక్యానికి కట్టుబడో, మీలా మా తల్లిదండ్రులు చదువులు చెప్పించకనో, భర్తే దైవం" అంటు, మా తల్లిదండ్రులు అత్తవారింట ఎలా పడుండాలో నూరిపోసింది తలకి పట్టించుకోవడం వల్లనో నా నోరు మూతపడి అన్నీ సహిస్తూ, ఇన్నేళ్ళుగా కాపరం చేస్తున్నానంటే మీకు నవ్వులాటగా వుంటుంది. మీరు మాలా కాకుండా పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మీ నిర్ణయాలు మీరు తీసుకుంటున్నారు. కొందరు పెళ్ళిళ్ళ విషయాల్లో కూడా స్వతంత్రిస్తున్నారు. మీ తరం వారు చాలా మారారు. మేము ఈ మార్పుల్ని చూసి ఆనందిస్తూ, మీతో మమ్మల్ని పోల్చుకుని బాధపడుతున్నాం. మా తరం వారు భర్త ఏంచేసినా, ఏమన్నా నోళ్ళు మూసుకున్నాం. ఎదిరించి అడిగిన ఆడదాన్ని – ఇంట్లోంచి పో –" అన్న భర్తలూ వున్నారు. అలాంటి ఆడదానికి పుట్టింటా గౌరవం వుండేది కాదు. తన బ్రతుకు తాను బ్రతుకుదామన్నా చదువు వుండేది కాదు. అలాంటి మాతరం వాళ్ళం భర్త, అత్తగార్లు పెట్టే హింసల్ని సహిస్తూ జీవచ్ఛవాల్లా బ్రతకడం తప్పేది కాదు.

కాలంతో పాటు మారిన మీరంతా ప్రగతి మార్గం వైపు పయనించడం గర్వించదగ్గ విషయమే. కానీ కొందరు ఆవేశాలతో అనాలోచితమైన పనులు కూడా చేస్తున్నారంటే ఒప్పుకోకతప్పదు. విషయం తెలిసిన వెంటనే కాస్త ఓర్పుతో నిజానిజాలు తెల్సుకుని, మంచీ చెడులు ఆలోచించుకుని నిర్ణయాలు తీసుకుంటూ వుంటే మీకు లభించిన ఈ స్వేచ్ఛా స్వాతంత్రాలు సద్వినియోగమవుతాయి. నేను మా తల్లిదండ్రుల్లా మిమ్మల్ని పడి వుండమని చెప్పను. కానీ ఏదన్నా జరిగినప్పుడు నిజానిజాలు తెల్సుకుని నిందించాలి. కళ్ళతో చూసింది, చెవులతో విన్నదే నమ్మాలి. ఆ వెర్రిబాగుల్ది గర్భవతి అయిందని అంటున్నావు. ఎవరివల్ల అని దాన్ని అడిగావా? అది ఏం చెప్పింది ? నీ భర్తని అడిగావా? ఏమన్నాడు?"

"అడిగానమ్మా ! ఆ వెర్రిది ఏమీ చెప్పలేకుండా వుంది. ఇంక నా మొగుడిని అడగడం ఎందుకు? అది మరే ఇంట్లోనూ పని చెయ్యటం లేదు, మా ఇంట్లో ఈయన తప్ప మరెవ్వరూ లేరు – ఇంకా ఆయన్ని అడగడం ఎందుకు? నేను ఆసుపత్రిలో వుండగా ఈ పని జరిగింది. వేవిళ్ళు, కళ్ళు తిరిగి పడటంతో నిన్న దాన్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే మూడోనెలని చెప్పింది. నాకు ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో వున్నప్పుడు కూడా ఈయనకి పెళ్ళాం కావలసొచ్చింది. అదే భార్యచేస్తే ?

"అమ్మా చూడు నువ్వు చెప్తున్న నీతులు మీ కాలంలో వర్తిస్తాయి. మా కాలంలో కాదు. ఈయన లేకుండా నేను నీతిగా బ్రతకగలను.

## అనురాధా సానీ

"నాకు చాలా దుఃఖంగా ఉండేది. నా చుట్టూ రకరకాల చర్మాలు. నాకు తెలుసు, అవి జంతువులను చంపి తెచ్చినవని" అన్న అనురాధ సానీ ఒకప్పుడు ఢిల్లీలో తోళ్ళ పరిశ్రమ (లెదర్ ఇండస్ట్రీస్)లో పనిచేసేవారు. కాని ఒకరోజు అకస్మాత్తుగా జంతువులను పెట్టే హింసకు తట్టుకోలేకపోయిన అనురాధ తన వృత్తికి రాజీనామా చేసి 'పేటా' (PETA)లో చేరారు. జంతువులను సంరక్షించడం, వాటిని కాపాడటం పేటా విధి. ఈ విధిలో భాగంగా జంతువులను వేటాడటాన్ని నిషేధించడం, అలా వేటాడేవాళ్ళతో పోరాడటం అనురాధ జీవితంలో ఓ భాగమైపోయింది.



"జంతువులకు కూడా జీవించాలన్న ఆశ ఉంటుంది. మనలాగే సాఫీగా బతకాలన్న కోరిక ఉంటుంది. వాటిని జీవించనిద్దాం." అంటున్న అనురాధా సానీ చాలామందికి ఆదర్శం.

ఆ - ఏమిటన్నావు? మా కాలం వాళ్ళం ఆవేశాలతో అనాలోచితంగా నిర్ణయాలు తీసుకుంటామా? విషయమంతా వివరంగా చెప్పాను మీ తరంతో పోల్చకుండా, మా తరాన్ని దృష్టిలో పెట్టుకుని చెప్పు. ఆవేశమైన, అనా లోచితమైన పనేం చేసానో ? ఇప్పుడా మనిషికి ఏం శిక్ష వెయ్యాలి? ఇదిగో చూడు విడాకు లియ్యడమే కాదు, కోర్టుకీడ్చి, పరువు మర్యాదలు తీస్తాను. ఆ మూగదాన్ని ఆయనకిచ్చి పెళ్ళి చేయిస్తాను. ఈ సమాజంలో తలెత్తుకుని తిరగలేకుండా చేస్తాను" అంటూ ఆవేశంతో ఎగురుతున్న కూతుర్ని శాంతపర్చ ప్రయత్నించసాగింది శారదమ్మ.

శారద ప్రయత్నం విఫలం కాసాగిందే తప్ప ఆమె మాటలు కల్పవల్లి చెవికెక్కటం లేదు. ఆవేశంతో రెచ్చిపోతున్న కూతుర్ని చూసి శారదమ్మ "కల్పవల్లీ ! అంటూ పెట్టిన కేకకి, కల్పవల్లి ఒక్కసారిగా ఆగిపోయి, చకితురాలై తల్లివైపు చూసింది. తల్లి ముఖంలో అంత కోపమెప్పుడూ కల్పవల్లి చూడలేదు.

కొంతసేపటికి శారదమ్మ సర్దుకుని కల్పవల్లి పక్కన కూర్చుని చూడమ్మా కల్పవల్లీ! ఇంతవరకూ నేను నీ దగ్గర ఓ విషయం చెప్పు కోకూడదని దాచాను. అదీ కాకుండా మీ తండ్రి గురించి చెప్పాకా కాస్త విషయం గ్రహించు కుంటావని ఆశించాను. కానీ నీలో ఆవేశం తప్ప ఆలోచన లేదు. పచ్చటి కాపరం కూలి పోతుంటే ఇక చెప్పక తప్పేటట్టు లేదు. ఆ వెర్రిపిల్ల, అమాయకురాలు గర్భవతి అవుత నీ భర్తవల్ల కాదు - నీ తండ్రి వల్ల!! నీఅబార్షనప్పుడు మేము మీ యింటి కొచ్చినప్పుడు దానికి మత్తు మాత్రలిచ్చి దాన్ని చెరిచారు. ఆయనకి లొంగని కొందర్ని ఇదే విధంగా లొంగదీసుకునేవారు. ఇప్పటివరకు నీ తండ్రి పాడు బుద్ధులు మీకు తెలీకుండా దాచిపెట్టినట్లే ఈ విషయం కూడా దాచాలని ప్రయత్నించాను. కూతురి కాపరం కూలిపోతుంటే ఏ తల్లీ కూడా సహించలేదు. అందుకే చెప్పాను. ఇప్పుడు చెప్పు. నీ తండ్రిని కోర్టుకే ఈడుస్తావో, ఈ వయసులో నా కాపరం కూలద్రోసి నన్ను రోడ్డు మీదకే ఈడుస్తావో?! నిర్ణయించుకో" అని కొంగుతో ముఖం కప్పుకుని ఏడుస్తున్న తల్లివైపు చూస్తూ స్థాణువులా నిలబడిపోయింది కల్పవల్లి.

"అమ్మా ! యిలాంటి దుర్మార్గుడితో యిన్నేళ్ళ నుంచి ఎలా కాపురం చేస్తున్నావమ్మా? రా నాతో వచ్చెయ్యి. ఆయన ఖర్మానికి ఆయన్ని వదిలేస్తేనన్నా బుద్ధొస్తుందేమో!" అన్న కూతురి వైపు చూస్తూ... "తల్లీ ! ఈ వయసులోనా? దేశంలో నాలాంటి దౌర్భాగ్యులెందరో వున్నారు. అందులో నేనూ ఒకర్తిని. నా ఖర్మానికి నన్నొది లేసి మీరు మాలా కాకుండా, ఆవేశాలతోనూ కాకుండా, నిజాన్ని తెల్సుకుని బ్రతకండి." అంటున్న తల్లివైపు జాలిగా చూస్తూ తెచ్చిన పెట్టే, బేగ్గూ పట్టుకుని వీధివైపుకు నడుస్తూ అనుకుంది కల్పవల్లి. "మా ఆయన్ని నిలదీసి అడక్కపోవడం మంచిదయింది. ఆయన క్యాంప్‌నుంచి వచ్చేలోగా ఇల్లు చేరిపోవాలి. పాపం ఆ అమాయకురాలికి ఏదో మార్గం చూపి, దాని బ్రతుక్కి ఓ మార్గం ఏర్పాటు చెయ్యాలి. అనుకుంటూ ఆటో ఎక్కింది.

"జీవితమంతా నాన్న అమ్మని బాధిస్తున్నా ఆమె క్షమిస్తూనే వస్తోంది. కానీ నేను!! భర్త చెయ్యని తప్పుని ఊహించుకుని ఎంత ముప్పు తెచ్చుకోబోయాను!!" అనుకుంటూ తలుపుదగ్గర నిలబడ్డ తల్లిని కళ్ళనీళ్ళతో చూస్తున్న కల్పవల్లి వైపు ఆనందంగా చూసింది శారదమ్మ.

## మహిళలూ... మహారాణులూ...

అద్భుతమైన నినాదం
అలవోకగా ఇచ్చే బిరుదప్రదానం
పొగడ్త గాలుల్లో పొంగిపోయే వారేననుకుంటారు
ని'ర్లజ్జ'గా మహిళా కవయిత్రులపై దాడికి పూనుకుంటూ
మహిళా అభ్యర్థులను దీటుగా పోటీలో నిలబెడుతూ
మహిళా రిజర్వేషన్‌ల బూచీతో ఏళ్ళకొలదీ కాలం గడుపుతూ
మహిళా సాధికారతను మట్టుబెడుతూ
మహిళా రిజర్వేషన్‌లను అపహాస్యం చేస్తూ
మహిళలూ... మహారాణులంటూ...
మంగళగీతాలు ఆలాపిస్తుంటారు.

మహిళకు సాటి మహిళే శత్రువంటూ
మహిళల మధ్య మర్మరహస్యం విప్పుతారు
మహిళల నోట మాట దాగదంటూ
రహస్యఛేదనం చేపడతారు
ముప్పై ఆరు జట్లు కలిసున్నా
మూడు శిగలు కలిసుండవంటూ
జాతికి గొప్ప సందేశం అందిస్తారు
మహిళలు అధికారం చేపట్టినా
మగరాజులే ముందుండి పాలనాపగ్గాలు చేబడ్తారు
అబలవు నీవంటూ
సబలలనీ సమూలంగా అణగద్రొక్కజూస్తుంటారు

అంతరిక్షం అధిరోహించినా
ప్రథమ పౌరురాలిగా విజయకేతనం ఎగురవేసినా
చదువుల్లో... కొలువుల్లో... సంపాదనల్లో...
అగ్రభాగాన నిలుస్తున్నా
యింకా మగ దౌష్ట్యాలు మారుమోగుతూనే వున్నాయ్
మానవ మృగాల నీతి మాటున
మహిళలు మహారాణులుగా వెలిగిపోతున్నారు.

- శ్రీ దాస్యం లక్ష్మయ్య